క్లుప్తంగా

జీవ రసాయన ఎరువులపై అవగాహన

పుల్లలచెరువు: జీవరసాయన ఎరువుతో మొక్కలకు సూక్ష్మపోషకాలు అందిస్తుందని, ప్రతి రైతు జీవరసాయన ఎరువులు వాడాలని ఉద్యానవనశాఖాధికారి ఆదిరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలోని సచివాలయం-1 పరిధి కిష్టంశెట్టి శ్రీనివాసులు అనే రైతు మిరప పొలంలో సాగు చేసిన మిరప పంటను పరిశీలించి ఆత్మ ఓరియెంటెడ్ పథకం ద్వారా జీవరసాయన ఎరువుపై అవగాహన కల్పించారు. జీవరసాయన ఎరువు తయారు చేసి పశువుల ఎరువులో కలిపి పొలంలో వేయించినట్లు తెలిపారు. జీవరసాయన ఎరువు బెట్ట పరిస్థితులు తట్టుకుని మొక్కలకు అవసరమైన పోషకాలు అందిస్తుందని, ప్రతి రైతు జీవరసాయన ఎరువులు అలవాటు చేసుకోవాలని కోరారు. వీఏఏ బ్రహ్మయ్య పాల్గొన్నారు.

నేడు జాతీయ లోక్‌అదాలత్

గిద్దలూరు రూరల్: పట్టణంలోని కోర్టు ఆవరణలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి బి.మేరీ శారాదానమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల కక్షిదారులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాజీ మార్గం ద్వారా లోక్‌అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవాలని కోరారు.

పాల వ్యాన్ బోల్తా

గిద్దలూరు రూరల్: గేదెలు అడ్డం రాగా ప్రమాదవశాత్తు పాల వ్యాన్ బోల్తా కొట్టిన సంఘటన గిద్దలూరు నంద్యాల రోడ్డులోని పెట్రోల్ బంకు సమీపంలో గురువారం అర్ధరాత్రి జరిగింది. నంద్యాల నుంచి గిద్దలూరు వైపు వస్తుండగా ప్రమాదం జరిగింది. ప్రమాదంలో డ్రైవర్ నాగరాజుకు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్ సమస్య లేకుండా వ్యాన్‌ను రోడ్డుకు అడ్డంగా లేకుండా తొలగించారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

పుల్లలచెరువు: మండలంలోని ఐటీ వరం ఎస్సీ పాలెం పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంఈవో ఇందిరా ప్రసాద్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం రుచిగా.. శుచిగా ఉండాలన్నారు. ప్రభుత్వం సూచించిన మెనూను అమలు చేయాలని ఆదేశించారు. భోజనం సక్రమంగా ఉంటుందా, చిక్కీ ఇస్తున్నారా.. అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వంట చేసే ప్రాంతం కూడా శుభ్రంగా ఉండాలన్నారు. మధ్యాహ్న భోజన విషయంలో రాజీ వద్దన్నారు. పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు.

పాలక మండలి సభ్యుడిగా ఈశ్వరరెడ్డి


ఈశ్వరరెడ్డిని సన్మానిస్తున్న వైస్ చాన్స్‌లర్ అంజిరెడ్డి

కంభం: ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యుడిగా పట్టణానికి చెందిన ఎస్ఎల్‌వీ బీఈడీ కళాశాల కరస్పాండెంట్ నరాల ఈశ్వరరెడ్డి ఎంపికయ్యారు. జిల్లాలో నూతనంగా ఏర్పడిన ఆంధ్రకేసరి విశ్వ విద్యాలయం పాలకమండలిలో 9 మంది సభ్యులు ఉండగా విద్యారంగం నుంచి ఈశ్వరరెడ్డిని ఎంపిక చేశారు. శుక్రవారం జరిగిన పాలక మండలి సమావేశంలో పాల్గొన్న ఈశ్వరరెడ్డిని వైస్ చాన్స్‌లర్ ఎం.అంజిరెడ్డి శాలువా, పూలమాలతో సత్కరించి అభినందించారు.

కాళికాంబ ఆలయంలో అన్నదానం


భక్తులకు అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

గిద్దలూరు రూరల్: శ్రావణమాసం శుక్రవారం సందర్భంగా పట్టణంలోని కాళికాంబ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు భారతి,సతీష్‌రెడ్డి దంపతులు భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. శ్రీ కృష్ణాష్టమి జయంతి వేడుకల్లో భాగంగా రాచర్లగేటు సెంటర్‌లోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో వేణుగోపాలస్వామిని ప్రత్యేకంగా అలంకరించారు.

ఘనంగా జీవిత బీమా ముగింపు వారోత్సవాలు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని ఎల్ఐసీ కార్యాలయం ఆవరణలో 67వ జీవితా బీమా ముగింపు వారోత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర రోడ్డు రవాణ సంస్థ డివిజనల్ మేనేజర్ చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. లంచగొండి తనం లేని మచ్చలేని సంస్థ జీవిత బీమా సంస్థ.. అని కొనియాడారు. విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఎల్ఐసీ ఉద్యోగులు చంద్రశేఖర్, నవీన్, కోటేశ్వరరావు, శివపార్వతి పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం


సచివాలయ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి


ఆర్బీకేను ప్రారంభించిన అనంతరం సిబ్బందితో ఎమ్మెల్యే కేపీ

- ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి
- కోలభీమునిపాడులో రూ.60 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, ఆర్బీకే ప్రారంభం

మార్కాపురం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ స్థాయిలో ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కోలభీముని పాడు గ్రామంలో 60 లక్షల రూపాయలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామ సచివాలయాల్లో 500కు పైగా సేవలు ప్రజలకు అందుతున్నాయన్నారు. గతంలో ఏ సర్టిఫికెట్ కావాలన్నా, పథకాలు పొందాలన్నా మండల కేంద్రంలో కార్యాలయాల చుట్టు తిరగాల్సి వచ్చేదని, ఇప్పుడా పరిస్థితి లేదన్నారు. రైతులు గతంలో విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు దొరక్క రోడ్ల పైకి వచ్చి ధర్నాలు చేసేవారని, జగనన్న ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రం ద్వారా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు ఇంటి వద్దకే వస్తున్నాయన్నారు. సచివాలయ వ్యవస్థ రాబోయే ఐదేళ్లలో దేశ వ్యాప్తంగా అమలయ్యే అవకాశం ఉందని ఇప్పటికే వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు ఇక్కడికి వచ్చి అధ్యయనం చేసి వెళ్తున్నాయన్నారు. మంచి కార్యక్రమాలు చేపడుతున్న జగనన్నను రానున్న ఎన్నికల్లో మరో మారు ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ సాయికుమార్, ఎంపీడీఓ నరసింహులు, పంచాయతీరాజ్ ఏఈ మోహన్‌రాజు, ఏఓ దేవిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఏఎంసీ చైర్మన్ జి.శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ చిట్టేటి సుబ్బారెడ్డి, డి.వెంకటేశ్వరరెడ్డి, ఇమ్మడి శ్రీరాములు, వైఎస్సార్ సీపీ నాయకులు వేల్పుల చెన్నారెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు సంధ్యారాణి, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల కొండయ్య, ఆర్బీకే సిబ్బంది సంధ్య, శివకుమార్, శివశంకర్, మల్లికార్జున్, పావనేశ్వరి జయంతి, సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ గడపలో లబ్ధి


ఎమ్మెల్యే అన్నా రాంబాబుకు స్వాగతం పలుకుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

- ఎమ్మెల్యే అన్నా రాంబాబు

రాచర్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న పథకాలతో రాష్ట్రంలో ప్రతీ గడపకు లబ్ధి చేకూరిందని ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు అన్నారు. మండలంలోని అనుమలవీడు సచివాలయం పరిధి పాలకవీడు, శీలంవెంకటరెడ్డిపల్లె గ్రామాల్లో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. తొలుత పాలకవీడు ప్రజలు ఎమ్మెల్యేకు భారీ గజమాలలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని రైతు కుటుంబానికి రైతు భరోసా ద్వారా ఏటా రూ.13,500 పెట్టుబడి సాయం కింద 5 ఏళ్లలో మెత్తం సాయం రూ.67,500 నేరుగా రైతు ఖాతాల్లో జయ చేయనున్నట్లు వివరించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కౌలు రైతులు, అటవీ, దేవదాయ భూములను సాగు చేసుకుంటున్న రైతులందరికీ రైతు భరోసా అందిస్తున్నారని వివరించారు. వైఎస్సార్ శాశ్వత భూహక్కు మరియు భూరక్ష ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా సామాన్యుల భూములు, ఆస్తుల రక్షణ కోసం 100 ఏళ్ల తర్వాత భూ వివాదాలకు చరమగీతం పాడి భూలావాదేవీలు సులభతరం చేసేందుకు అధునిక సమగ్ర భూ రీసర్వే చేసినట్లు పేర్కొన్నారు. అంతేగాక వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీ, వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకాలు రాష్ట్రంలోని రైతులకు వర్తింపజేస్తున్నట్లు వివరించారు. రైతుల కోసం అనేక పథకాలు ప్రవేశ పెట్టి నేరుగా రైతులకు అందజేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో మళ్లీ సీఎం చేసుకోవాలన్నారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఎంపీపీ షేక్ ఖాశింబీ, సర్పంచ్ షేక్ పల్నాటి లతీఫ్, మాజీ సర్పంచ్ కొర్నిపాటి నాయబ్ రసూల్, జేఏసీ మండల కన్వీనర్ బెల్లం నాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యేలం మురళీకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు పగడాల శ్రీరంగం, సూర పాండుంగారెడ్డి, బద్దెటి ప్రవీణ్‌కుమార్, అన్నపురెడ్డి పిచ్చిరెడ్డి, పీరారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, భూపని నాగేశ్వరరావు, గాలేబోయిన వీరాంజనేయులు, ఎంపీడీవో కె.కవితా చౌదరి, కార్యదర్శి వెంకట్వేరనాయక్ పాల్గొన్నారు.

విద్యకు పెద్దపీట వేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం


మాట్లాడుతున్న సీపీడీసీ చైర్మన్ సుబ్బారావు

యర్రగొండపాలెం: రాష్ట్ర ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తోందని, ప్రతి ఒక్కరినీ చదివించడమే లక్ష్యంగా పెట్టుకొని అనేక కార్యక్రమాలు చేపడుతోందని శ్రీశైలం దేవస్థానం ట్రస్ట్ మాజీ డైరెక్టర్, కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ ఐవీ సుబ్బారావు అన్నారు. ప్రపంచ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక మోడల్ డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ మనబడి నాడు-నేడు కింద రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేశారని, ఇంగ్లిష్ మీడియం ప్రవేశ పెట్టి అన్ని వర్గాలకు చెందిన పేద విద్యార్థులు పాఠశాలకు వెళ్లే విధంగా చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు. దేశంలోనే కాకుండా విదేశాల్లో చదువుకునేందుకు కూడా ప్రభుత్వం ఆర్థిక సాయం చేస్తోందని, విద్యార్థులు ఉన్నత విద్యకు బాటలు వేయాలన్నారు. ప్రిన్సిపాల్ జి.శ్రీధర్‌నాయుడు, అధ్యాపకులు నాగరాజు, ఐకేవీ సుబ్బారావు, పిల్లి ప్రదీప్, పి.రామకోటయ్య, డి.సుజాత, కె.శ్రీనివాసరావు, షేక్ రహమత్ ఉన్నిసా, కేవీఎస్ శ్రీనివాస్, పి.ఝాన్సీ, వి.వెంకటేశ్వరెడ్డి, ఎస్.రాజానాయక్ పాల్గొన్నారు.

11 నుంచి స్కూల్ గేమ్స్ సెలక్షన్

పొదిలి: స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఈనెల 11వ తేదీ నుంచి స్కూల్ గేమ్స్ క్రీడాకారుల సెలక్షన్ నిర్వహించనున్నట్లు పీడీ షకీల తెలిపారు. పాఠశాలలో శుక్రవారం పీడీ, పీఈటీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ 9 క్రీడాంశాల్లో అండర్-14, అండర్-17లో బాలబాలికల విభాగంలో సెలక్షన్స్ ఉంటాయన్నారు. సమావేశంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు


ఉభయ దేవేరులతో శ్రీకృష్ణునిగా చెన్నకేశవస్వామి

మార్కాపురం: శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయంలో కృష్ణాష్టమి పర్వదినం సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద ఉన్న ఉట్ల మండపంలో ఉభయ దేవేరులతో చెన్నకేశవస్వామి వారు శ్రీకృష్ణునిగా ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. యువకులు ఉట్టిని కొట్టేందుకు పోటీ పడ్డారు.

11 నుంచి మండల స్థాయి ఆటల పోటీలు

ముండ్లమూరు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీ నుంచి మండల స్థాయి ఆటల పోటీలు నిర్వహిస్తారని మండల స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ జి. భవన్నారాయణ శుక్రవారం తెలిపారు. పూర్తి వివరాలకు మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ జి. భవన్నారాయణ 9246468054 నంబర్‌ను‌సంప్రదించాలన్నారు.

భర్తపై వేధింపుల కేసు నమోదు

కురిచేడు: భర్త వేధింపులపై స్థానిక పోలీసు స్టేషన్లో శుక్రవారం కేసు నమోదైంది. ఎస్‌హెచ్‌ఓ సింగయ్య తెలిపిన వివరాల ప్రకారం.. దేకనకొండ గ్రామానికి చెందిన యర్రగుంట్ల కోటమ్మకు అదే గ్రామానికి చెందిన యర్రగుంట్ల వెంకట్రావుతో 9 సంవత్సరాల క్రితం వివాహమైంది. వెంకట్రావు బేల్దారీ పనులు చేస్తుంటాడు. పనుల నిమిత్తం హైదరాబాదు వెళ్లాడు. అక్కడ పనులు చేస్తూ పనికి వచ్చే కూలీలతో వివాహేతర సంబంధం నెరుపుతుండటంతో భార్య కోటమ్మ చూసి భర్త వెంకట్రావును ప్రశ్నించింది. అది మనసులో పెట్టుకున్న వెంకట్రావు నిత్యం కోటమ్మను వేధిస్తుండటంతో తట్టుకోలేక పుట్టింటికి చేరింది. శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

విద్య ఆవశ్యకత గుర్తించాలి

దర్శి: విద్య ఆవస్యకతను తల్లిదండ్రులు గుర్తించాలని కట్టశింగన్నపాలెం హెచ్‌ఎం సి. సుధాకరరావు అన్నారు. స్థానిక ఆపాఠశాలలో అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

ఆరుతడి పంటలకు ప్రాధాన్యత

ముండ్లమూరు: నాగార్జున సాగర్‌లో సమృద్ధిగా నీరు లేనందున సాగర్ ఆయకట్టు రైతులు ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఉండి ఫరూక్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాలులో శుక్రవారం మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం సలహా మండలి చైర్‌పర్సన్ మారం శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన మాట్లాడారు. ఏఈఈ ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోండి

దొనకొండ: గ్రామాల్లోని రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ బొరిగొర్ల ఉషా మురళీ తెలిపారు. స్థానిక వైకేపీ కార్యాలయంలో శుక్రవారం మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. దర్శి వ్యవసాయ సహాయ సంచాలకులు బాలాజీనాయక్, వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ, యూనిట్ ఇన్‌చార్జ్ వేణుగోపాల్, ఏఎంసీ డైరెక్టర్ రసూల్ పాల్గొన్నారు.

రాజన్న రాజ్యం జగనన్నకే సాధ్యం


లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

- ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

పొదిలి రూరల్: రాష్ట్రంలో ఎన్నో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన రాజన్న పరిపాలన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పొదిలి మండలం కంభాలపాడు సచివాలయం పరిధిలోని మిట్టపాలెంలో మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులురెడ్డితో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరించడంతోపాటు సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి మాట్లాడుతూ.. వైఎస్సార్ హయాంలో రైతులకు ఉచిత విద్యుత్, 108, 104, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, జలయజ్ఞం తదితర పథకాలు ప్రవేశపెట్టి దేశానికే ఆదర్శంగా నిలిచారని గుర్తు చేశారు. ఆయన పథకాలను కొనసాగిస్తూ, మరిన్ని కొత్త పథకాలు అమలు చేస్తూ తండ్రికి తగ్గ తనయుడిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల మన్ననలు పొందుతున్నారని కొనియాడారు. అభివృద్ధి ఎక్కడ అని ప్రశ్నించే వారు గ్రామాల్లో, వార్డుల్లో తిరిగితే కనిపిస్తుందని చురకలంటించారు. గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, డిజిటల్ గ్రంథాలయాలు, బల్క్‌మిల్క్ సెంటర్లతోపాటు నాడు-నేడు ద్వారా ఆధునీకరించిన పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆస్పత్రులు సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు కనిపిస్తాయన్నారు. పచ్చ మీడియాలో మాట్లాడితే లోకమంతా పచ్చగానే కనిపిస్తుంది తప్ప అభివృద్ధి కనిపించదన్నారు. ముందుగా ఎమ్మెల్యేతోపాటు ఇతర ప్రజాప్రతినిధులకు స్థానిక నాయకులు తల్లపురెడ్డి వెంకట నారాయణరెడ్డి, బసిరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, అంబటి సీతారామిరెడ్డి, అంబటి ఓబుల్‌రెడ్డి, నాగిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మల్లాపురం నరసింహులు ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. వైఎస్సార్, అంబేడ్కర్ విగ్రహాలకు ఎమ్మెల్యే నివాళులర్పించారు. అనంతరం ఆంజనేయస్వామి ఆలయం, రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ డానియేల్ జోసఫ్, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, కేవీ రమణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసులు, మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి, నూర్జహాన్ బేగం, మర్రిపూడి ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ గుజ్జుల రమణారెడ్డి, కల్లం సుబ్బారెడ్డి, మాజీ ఎంపీపీలు కె.నరసింహరావు, ఉడుముల రామనారాయణరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ గొలమారి చెన్నారెడ్డి, మాజీ సర్పంచ్ పులిగొర్ల శ్రీనివాసలు, మండలపు శ్రీనివాసరెడ్డి, ఫిరోజ్, జాకీర్, మాబాషా, బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

250 మందికి వైద్య పరీక్షలు


మందులు పంపిణీ చేస్తున్న వైద్యులు

అర్ధవీడు (కంభం): మండలంలోని యాచవరంలో శుక్రవారం ఏర్పాటు చేసిన డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ వైద్యశిబిరాన్ని సర్పంచ్ డి.పీరయ్య ప్రారంభించారు. శిబిరంలో ఒంగోలుకు చెందిన అమ్మ పిల్లల హాస్పిటల్ వైదులు డాక్టర్ ఆశ, అమృత హార్ట్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ వెంకట్రావు, డాక్టర్ పద్మావతిలు రోగులను పరీక్షించారు. 250 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఆరోగ్యశ్రీ సిబ్బంది హెప్సిబా, రంగపుల్లారావు, నారాయణరెడ్డి, కెజియా లక్ష్మి పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: మండలంలోని నరవలో డాక్టర్ బ్రహ్మానందరెడ్డి వైద్యశాల బృందం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన వైద్య శిబిరంలో 263 మందికి వైద్య పరీక్షలు చేశారు. డాక్టర్ బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ వివిధ రకాల వ్యాధులకు ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు.

నేత్రదానంపై అవగాహన ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ మోహన్‌రెడ్డి

గిద్దలూరు రూరల్: నేత్రదానంపై ప్రతి ఒక్కరూ పూర్తి అవగాహన కలిగి ఉండాలని కంటి వైద్యుడు మోహన్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని రాజుపారా మెడికల్ కాలేజీ ఆవరణలో శుక్రవారం నేత్రదాన పక్షోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రపంచ జనాభాలో 15 శాతం అంధులు భారతదేశంలో ఉన్నారన్నారు. దేశంలో సుమారు 13 మిలియన్ల మంది నల్లగుడ్డు అంధత్వంతో బాధపడుతున్నారని పేర్కొన్నారు. పోషకాహార లోపాల కారణంగా కంటి సమస్యలు తలెత్తుతాయన్నారు. మనిషి మరణించిన నాలుగు గంటల సమయంలో నేత్రాలను దానం చేయవచ్చని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కంటి వైద్య పరీక్షలు చేశారు. కాలేజీ ప్రిన్సిపల్ రాజు, లెక్చరర్స్ మహబూబీ, శివ, విద్యార్థులు పాల్గొన్నారు.

పదోన్నతితో మరింత బాధ్యత


రాజశేఖర్‌ను సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పొదిలి రూరల్: ఉద్యోగ జీవితంలో పదోన్నతి మరింత బాధ్యతను పెంచుతుందని తహసీల్దార్ అశోక్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఈవోఆర్డీ రాజశేఖర్ పదోన్నతిపై లింగసముద్రం ఎంపీడీఓగా నియమితులైన సందర్భంగా శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సన్మాన సభలో తహసీల్దార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగులకు బదిలీలు సాధారణమని, విధి నిర్వహణలో ఉత్తమ పనితీరు కనబరిచి ప్రజల మన్ననలు పొందాలన్నారు. పదోన్నతి పొందిన రాజశేఖర్‌కు శుభాకాంక్షలు తెలిపి, ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీకృష్ణ, ఎంఈఓ శ్రీనివాసరెడ్డి, ఏఓ జైన్‌లాబ్దిన్, వైఎస్సార్ సీపీ నాయకులు కేవీ రమణారెడ్డి, జి.శ్రీనివాసులు, గుజ్జుల రమణారెడ్డి, కల్లం సుబ్బారెడ్డి, నూర్జహాన్‌బేగం, కె.నరసింహరావు, కె.సుబ్బారావు, బండి అశోక్, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

విజయకుమార్‌ను కలిసిన దొనకొండ వాసులు


విజయకుమార్‌కు కలిసిన దొనకొండ వాసులు

దొనకొండ: మాజీ కలెక్టర్ డా.జి.ఎస్.ఆర్.కె.ఆర్ విజయకుమార్ తడ నుంచి తుని వరకు ఐక్యత విజయ పథం పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా పాదయాత్ర శుక్రవారం ప్రకాశం జిల్లా లింగసముద్రం రాళ్ళపాడు రిజర్వాయర్ వరకు సాగింది. దొనకొండకు చెందిన మురికిపూడి జాన్‌పీటర్ ఆధ్వర్యంలో పలువురు విజయకుమార్‌ను కలిసి శాలువలు, పూలమాలలతో సత్కరించి సంఘీభావం తెలిపారు. కొంగలేటి మోహన్‌రావు, ఆనంద్‌కుమార్, బూదాల రాజా, గాంధీ ఉన్నారు.

ఉత్తమ అధ్యాపకునికి సన్మానం

పెద్దదోర్నాల: ఉత్తమ అధ్యాపకునిగా రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ చేతుల మీదుగా అవార్డు అందుకున్న స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల కంప్యూటర్ సైన్స్ అధ్యాపకుడు డాక్టర్ నాగరాజు అభినందనీయుడని ప్రిన్సిపాల్ మగ్బుల్ హుస్సేన్ అన్నారు. శుక్రవారం డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ నాగరాజును ఘనంగా సన్మానించారు.

కంభం చెరువును పరిశీలించిన డీఎస్పీ


చెరువు కట్టను పరిశీలిస్తున్న డీఎస్పీ

కంభం: వినాయక చవితి పండగను పురస్కరించుకొని విగ్రహాల నిమజ్జనం జరిగే చారిత్రాత్మక కంభం చెరువును ఎస్పీ మలికా గర్గ్ ఆదేశాల మేరకు మార్కాపురం డీఎస్పీ వీరరాఘవరెడ్డి శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. నిమజ్జనం జరిగే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తీసుకోవాల్సిన బందోబస్తు తదితర అంశాలపై సిబ్బందికి ఆయన సూచనలు చేశారు. డీఎస్పీ వెంట సీఐ ఎం.రాజేష్, కంభం, బేస్తవారిపేట ఎస్ఐలు నాగమల్లేశ్వరరావు, నరసింహారావు ఉన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

పెద్దదోర్నాల: మండల పరిధి చిన్నగుడిపాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శుక్రవారం సూర్య శ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నోట్ బుక్స్, స్టేషనరీ, బిస్కెట్స్, చాక్లెట్స్ పంపిణీ చేశారు. చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ లక్ష్మీకిరణ్ సహకారంతో ఎంఈఓ మస్తాన్ నాయక్ విద్యార్థులకు నోట్ బుక్స్ అందజేసారు. మస్తాన్ నాయక్ మాట్లాడుతూ సూర్య శ్రీ ట్రస్ట్ ప్రతినిధులు విద్యార్థుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఇటువంటి కార్యక్రమాలు చేయటం అభినందనీయమన్నారు. విద్యార్థులు ఉపయోగించుకుని చక్కగా విద్యనభ్యసించాలని కోరారు. ప్రధానోపాధ్యాయుడు టి.రత్న ప్రసాద్, ట్రస్ట్ సలహాదారుడు, పాఠశాల ఉపాధ్యాయుడు మండవ సుబ్బారావు పాల్గొన్నారు. అనంతరం ముఖ్య అతిథిగా హాజరైన మస్తాన్ నాయక్‌ను శాలువా, పూలమాలలతో సత్కరించారు.